ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 1 ఏప్రిల్ 2025





శ్రీకాకుళం జామియా మసీదులో మత పెద్ద ఇమామ్ వహాబ్ ఆధ్వర్యంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



భక్తిశ్రద్ధలతో రంజాన్

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం వేళ.. జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. మసీదుల్లో నమాజ్‌లు చేసి.. ఆత్మీయ ఆలింగనంతో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శ్రీకాకుళంలోని జామియా మసీదులో మత పెద్ద ఇమామ్ వహబ్ ఆధ్వర్యంలో నమాజ్‌లు నిర్వహించగా అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. పితృదేవతలున్న సమాధుల వద్ద నివాళి అర్పించారు. రంజాన్ వేడుకల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మాట్లాడుతూ.. హిందూ ముస్లింలు ఐక్యతతో పండుగలు నిర్వహించుకోవడం ఆనందకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బహదూర్ బాషా, నిజాముద్దీన్, షాను, రచయిత ఎస్.మహమ్మద్ రఫీ (ఈ-వేమన), మహిబుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త.. కంపు!

- మునిసిపాలిటీల్లో పేరుకుపోతున్న నిల్వలు
- 'సంపద' కోసం వేచి ఉంటే వ్యాధుల ముప్పు
- కొన్నింటిలో పారిశుధ్య కార్మికుల కొరత
- అస్తవ్యస్తంగా మురుగు కాలువలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



● పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ శ్రీనివాసనగర్‌లో పారిశుధ్యం దుస్థితి ఇది. రోడ్డుకిరువైపులా ఇలా చెత్త దర్శనమివ్వడంతో అటువైపుగా వెళ్లిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజూ ఇక్కడ పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 11వ వార్డు పరిధి పూజారివీధిలోని రాధాకాంత్ కోనేరులో చెత్త, పూడిక పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని వాపోతున్నారు.

చెత్త ఉత్పత్తి ఇలా..

మునిసిపాలిటీ	చెత్త (రోజుకు టన్నుల్లో)
ఇచ్ఛాపురం	18
పలాస-కాశీబుగ్గ	28
ఆమదాలవలస	13
శ్రీకాకుళం	62.5

పలాస/ కాశీబుగ్గ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో చెత్తనిల్వలు పేరుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం.. చెత్త నుంచి సంపద కేంద్రాలు తయారుచేయాలని ఆదేశించింది. అలాగే పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చింది. ప్రతీ నెలా మూడో శనివారం ప్రతి ఒక్క ఉద్యోగి పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, ప్రజలు మన్ననలు పొందాలని సూచించింది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని పేర్కొంది. ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, అమ్మకం, వినియోగంపై నిషేధం విధించింది. నిషేధాజ్ఞలు పాటించకపోతే జరిమానా విధిస్తామని స్పష్టం చేసింది. కానీ ఇది ఆచరణలో సాధ్యమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నిషేధం విధించినా ప్లాస్టిక్ వినియోగం పెరుగుతూనే ఉంది. జిల్లాలో ఎక్కడికక్కడ చెత్త నిల్వలు దర్శనమిస్తూనే ఉన్నాయి. దీనిపై అధికారులకు చిత్తశుద్ధి కరువవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మునిసిపాలిటీలు ఉన్నాయి. ఈ నాలుగు ప్రాంతాల్లో టన్నుల కొద్దీ చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను పారబోయడం తప్ప గత్యంతరం లేని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం చెత్తపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం పురపాలక సంఘాల్లో (మిగతా 7వ పేజీలో..)

కార్మికుల కొరతతో ఇక్కట్లు

ఆమదాలవలస, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పురపాలక సంఘం ఏర్పడి 30 సంవత్సరాలు కావస్తున్నా.. పారిశుధ్య నిర్వహణపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మునిసిపాలిటీలో ప్రధానంగా పారిశుధ్య కార్మికుల కొరత కనిపిస్తోంది. 23 వార్డుల పరిధిలో సుమారు 90మంది కార్మికులు అవసరం కాగా.. ప్రస్తుతం రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో 57 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఇంటింటా చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వ హణ సక్రమంగా సాగడం లేదు. మునిసిపాలిటీ చెత్తను ఒకటో వార్డులోని జగ్గుశాస్త్రులపేటలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుకు రోజూ తరలించాలి. కాగా ప్రస్తుతం మూడు ట్రాక్టర్లు, ఒక కంపార్ట్ వాహనం మాత్రమే ఉండడంతో చెత్త తరలింపు సక్రమంగా అమలు చేయలేకపోతున్నారు. పట్టణంలో సేక రించిన చెత్తను లక్ష్మీనగర్ శివారు ప్రాంతంలో ఉన్న చెరువు గట్టుపై వేస్తున్నారు. పట్టణానికి దూరంగా ఉన్న ఒకటి, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు వార్డులకు చెత్త సేకరణ కోసం వాహనాలు వెళ్లాలంటే కొంతమేర ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తు న్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా సాగేలా చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



పలాస: ఉదయపురం శివారున కాలువలో పేరుకుపోయిన చెత్త



ఆమదాలవలస : చెరువు గట్టుపై వేసిన చెత్తకుప్పలు



హిరమండలం: కేజీబీవీలో ఇంటర్ విద్యార్థినులు

ఇంటర్ విద్య.. మరింత ముందుకు

- నేటి నుంచి ద్వితీయ సంవత్సరం తరగతులు
- సీబీఎస్ఈ సిలబస్ అమలు
- 7 నుంచి 'ప్రథమ' ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

హిరమండలం/ సోంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తోంది. విద్యార్థుల భవితకు బంగారుబాటలు వేసేందుకు చర్యలు చేపడుతోంది. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ స్థాయిలో సీబీఎస్ఈ సిలబస్ అమలుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా మంగళవారం (ఏప్రిల్ 1) నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులను ప్రారంభించనుంది. ఏప్రిల్ 7 నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనుంది. ఏప్రిల్ 23వరకు తరగతులు నిర్వహించి.. 24 నుంచి వేసవి సెలవులు ఇవ్వనుంది. జూన్ 1 నుంచి విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. వచ్చే ఫిబ్రవరిలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేసింది. కళాశాలల పని దినాలను 222 నుంచి 235కి పెంచింది. దీంతో ఇంటర్ విద్య మరింత ముందుకు వచ్చి.. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

● ఉచితంగా పుస్తకాలు

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, మోడల్ స్కూల్‌లో కళాశాలలు 13, కస్తూరిబాయి జూనియర్ కళాశాలలు 25, సాంఘిక, గిరిజన సంక్షేమ కళాశాలలు 10 ఉన్నాయి. వీటితో పాటు ప్లస్-1 కళాశాలలు 6, మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల కళాశాల -1 కలిపి మొత్తం 93 కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది నుంచి వీటన్నింటిలో నూతన విద్యావిధానం ద్వారా తరగతులు బోధించనున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సీబీఎస్ఈ పుస్తకాలను ప్రభుత్వ ఉచితంగా అందించనుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాటితో పాటు నోటుపుస్తకాలు, రికార్డు షీట్లు ఉచితంగా ఇవ్వనున్నారు. ప్రస్తుతం రోజుకు ఏడు పీరియడ్లు (మిగతా 8వ పేజీలో..)



సంతబొమ్మాళిలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్న

పది వేల సోలార్ కనెక్షన్ల మంజూరు

- ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం
- ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేయాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

8లో

నువ్వలరేవులో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం

8లో

ఆదిత్యాలయ భద్రతపై ప్రత్యేక దృష్టి

- సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆరా

7లో

విద్యారంగాన్ని కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

7లో

ఐదెకరాల్లో జీడి తోట దగ్ధం

- నిప్పు పెట్టిన ఆకతాయిలు.. వ్యాపించిన మంటలు

8లో

అప్పుడు ముంపు.. ఇప్పుడు ఎద్దడి

- అస్తవ్యస్తంగా గ్రోయిన్లు
- వర్షాకాలంలో పోటెత్తుతున్న వరద
- ఏటా బెల్లుపడకు తప్పని ఇబ్బందులు
- 1,800 ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం



అధ్వానంగా బాహుదా కాలువ

ఇచ్ఛాపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో బాహుదా నది ఉన్నా, ఆశించిన స్థాయిలో నీటి లభ్యత లేదు. ఎగువ ప్రాంతంలోని ఒడిశాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమే అందుకు కారణం. పోనీ జిల్లాలో సాగునీటి వనరుల నిర్మాణం నోచుకోవడం లేదు. ఉన్న వాటి నిర్వహణ సక్రమంగా లేదు. ముఖ్యంగా గ్రోయిన్ల నిర్వహణ చేపట్టకపోవడంతో శివారు ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు.

● ఇచ్ఛాపురం పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న బెల్లుపడలో 1800 ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా వర్షాకాలంలో ఈ ప్రాంతానికి ముంపు తప్పదు. వర్షాభావ పరిస్థితుల్లో పంట ఎండిపోయి తీవ్ర నష్టం జరుగుతుంది. వర్షాకాలంలో బాహుదా నదికి అడ్డంగా రక్షణ గోడ కావాలి. ఇతర సమయాల్లో గ్రోయిన్లు సక్రమంగా పనిచేయాలి. అప్పుడే వర్షాకాలంలో సాగునీరు, మిగిలిన సమయాల్లో ఇతర అవసరాలకు నీరు అందుతుంది. లేదంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. ప్రస్తుతం బెల్లుపడ వాసులకు ఖరీఫ్, రబీ సమయాల్లో సాగునీరు అందదు. వర్షాకాలంలో అయితే ముంపు తప్పదు.

అస్తవ్యస్తంగా కాలువ

బెల్లుపడలో 1800 ఎకరాల భూమి సాగులోకి రావాలంటే బాహుదా నది కీలకం. బాహుదా నది నుంచి బెల్లుపడ కాలువ ఉంది. నది ఉత్తరం వైపున రాతికట్ట ఉంటుంది. అక్కడ నుంచి నీరు ఉత్తరం వైపు వెళ్లి బెల్లుపడ ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. కానీ గ్రోయిన్ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో ఏటా ఖరీఫ్‌లో బెల్లుపడ కాలువకు రైతులు సొంతంగానే మరమ్మతులు చేసుకుంటున్నారు. వరదల సమయంలో గ్రోయిన్‌కు గండి పడితే.. రైతులే సొంతంగా ఇసుక బస్తాలు వేసుకొని ఆ గండిని పూడ్చుతున్నారు. నీటిని అతి కష్టమ్మీద బెల్లుపడ కాలువకు తరలిస్తున్నారు. అయితే బాహుదాకు భారీ వరదలు సంభవించినప్పుడు బాధిత ప్రాంతం కూడా బెల్లుపడే. అందుకే బెల్లుపడకు రక్షణ గోడ నిర్మించాలి. అదే సమయంలో గ్రోయిన్ మర మ్మతులు చేపట్టాలి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు రూపొందించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వేసవిలోనే వీటి నిర్మాణ పనులు చేపట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

● ఏటా ఇబ్బందులే..

ఏటా మాకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో వరద ముంపు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రోయిన్ పనిచేయడం లేదు. ఇక్కడ రాతికట్టు అస్తవ్యస్తంగా ఉంది. ఈ ప్రాంత సమస్యలు తప్పాలంటే రక్షణ గోడ నిర్మించాలి. ఆపై గ్రోయిన్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

-ఆశి జీవులు రెడ్డి, ఆయకట్టు రైతు, బెల్లుపడ

గ్రోయిన్లపై దృష్టిపెట్టాం..

బాహుదా నదిలో గ్రోయిన్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. మరమ్మతులతోపాటు పునరుద్ధరణకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేశాం. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు నివేదించాం. ఆయన సైతం ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

-ధనుంజయరెడ్డి, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, బెల్లుపడ

భక్తిశ్రద్ధలతో రంజాన్

● మసీదుల్లో ప్రార్థనలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం రంజాన్ పండగ ను భక్తిశ్రద్ధలతో ముస్లింలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభా కాంక్షలు తెలుపుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



నరసన్నపేట: రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



కాశీబుగ్గ: జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రణస్థలం: జామియా మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కంచిలి: మక్కా మసీదులో ..



పాతపట్నం: ప్రహరాజపాలెంలో..



ఇచ్ఛాపురం: కస్పావీధి మసీదు వద్ద ముస్లిం చిన్నారులు..

పేదల సంక్షేమమే టీడీపీ లక్ష్యం



మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ కృషి చేస్తుందని ఆ పార్టీ న్యాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో వితంతు పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యాలయ అధికార ప్రతినిధి మొదలవలస రమేష్, వార్డు ఇన్‌చార్జి ఎన్ని శ్రీదేవి, నాయకులు ఎస్.మురళీధర్, తంగి గురయ్య, నాగళ్ల మురళీధర్, యాదవ్ విశ్వనాథం, రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

సోంపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గొల్లగండి గ్రామానికి విద్యుత్ సమస్య వెంటాడడంతో గ్రామస్థులతో కలసి మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గండుపల్లి రాజారావు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జనసేన సమన్వయకర్త దాసరి రాజుకు గతం వినతి పత్రం అందించారు. ఈ మేరకు గ్రామానికి సంబంధించి 19 విద్యుత్ స్తంభాలు, కొత్తవైర్లు ఏడీ రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య తీర్చినందుకు సర్పంచ్ నాగం భాస్కరరావు, గ్రామస్థులు గండుపల్లి దండాసి, గంగయ్య తదితరులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నీలమ్మతల్లికి స్వర్ణ కిరీటం



శ్రీకాకుళం కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెద్ద బరాటంవారి వీధిలో ఉన్న నీలమ్మతల్లి అమ్మవారికి నూతన స్వర్ణ కిరీటం, రజిత మకరతోరణ అలంకరించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బరాటం సాయి రాజ్ మాట్లాడుతూ.. దాతలు ఇచ్చిన ఆభరణాలను అమ్మవారికి అలంకరించామన్నారు. ఆలయ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

ఎంటీఎస్ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎచ్చెర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష ప్రాజెక్ట్‌లో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు మినిమం టైమ్‌స్కేల్ (ఎంటీఎస్) వర్తింపజేయాలని పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చిలకపాలెంలో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. గత 13 ఏళ్లుగా పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను ఒకేషనల్ టీచర్లుగా గుర్తించాలన్నారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమకు ఎంటీఎస్ వర్తింపజేసి ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వైసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎల్.దిలీప్‌కుమార్, కోశాధికారి తారకేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ఇచ్ఛాపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని వార్డెన్‌కు డీబీసీడబ్ల్యూవో అనురాధ సూచించారు. సోమవారం హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆమె వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. హాస్టల్‌లో విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇచ్ఛాపురం బీసీ హాస్టల్‌లో 120 సీట్లకు గాను ప్రస్తుతం 35మంది విద్యార్థులు ఉన్నారని, మిగిలిన 65 సీట్ల భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆంధ్రాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒడిశా గ్రామాల విద్యార్థులను కూడా హాస్టల్‌లో జాయిన్ చేయించుకోవా లన్నారు. కార్యక్రమంలో వార్డెన్ రవికుమార్ పాల్గొన్నారు.

హిజ్రాల నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న హిజ్రాలు

ఇచ్ఛాపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో దారుణ హత్యకు గురైన హిజ్రా దీపునకు న్యాయం చేయాలని నియోజకవర్గంలోని హిజ్రాలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పాత బస్టాండ్ జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. దీపును హతమార్చిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలన్నారు. హిజ్రాలు సుంజన కిన్నెర, లవ్లీ నిహారిక, మీనాక్షి, సోనియా, బెబో సోనాలి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా వినూత్నగా ఈ-వేమన కవితా నిలయం అధ్యక్షుడు ఎస్.మహమ్మద్ రఫీ (ఈ-వేమన) ఆధ్వర్యంలో కేంద్ర గ్రంథాలయంలో రంజాన్ కవి సమ్మేళన నిర్వహించారు. సూరంగి మోహనరావు మాట్లాడుతూ.. భారతదేశ లౌకికత్వం గల దేశం అని, సర్వమతాలకు సమానమని శ్రీకాకుంలో ఈ-వేమన ఆధ్వర్యంలో రంజాన్ కవి సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తంగి ఎర్రమ్మ, విజయలక్ష్మి, ఐఎన్‌డీ ప్రసాద్, గుడిమెట్ల, శ్రీనివాసరావు, తాళ్ళూరి విజయ లక్ష్మణ్, బలివాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి అభినందన

ఇచ్ఛాపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మెప్మా డిపార్ట్‌మెంట్ నాలుగు వరల్డ్ రికార్డులు సాధించారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ రామయ్యపుట్టుగ తన నివాసంలో మెప్మా సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్లను మెప్మా సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో మెప్మా సీవో, డీఈవో, ఎస్ఎల్ఎఫ్, ఆర్పీలు పాల్గొన్నారు. మెప్మా సిబ్బందికి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పీలక రాజలక్ష్మి అభినందించారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పర్వదినాన పేద ముస్లింలకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో 250 మందికి సోమవారం రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఐదు కిలోల గోధుమ పిండి, రెండు కిలోల పంచదార, అర కిలోల సేమ్యా, ఖర్జూరం పావు కిలో, నెయ్యి పావు కిలో గల కిట్లను పంపిణీ చేశారు. ప్రేమ, సోదర భావాలకు నిలయమైన రంజాన్ పండుగను పేద ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నగర మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ నిజాముద్దీన్, ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ పూర్వపు సభ్యులు బహదూర్ భాషా, ఎండీ రఫీ, షేక్ సలీం, షేక్ హుస్సేన్, ఎండీ జహంగీర్, షేక్ రిహాన్, షేక్ కమల్, ఆయేషా, షకీరా, జాస్మిన్, షేక్ పర్వీన్, సన్ని, షేక్ రేష్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను పూర్వ విద్యార్థులు, నగర కమిషనర్ ప్రసాదరావుతో కలిసి సందర్శించారు. తిలక్ హాల్ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవదత్తానంద్, నాయకులు పాండ్రంకి.శంకర్, జామి భీమశంకరరావు, కెల్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మన ఊరికి-మన ఎమ్మెల్యే'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలో 'మన ఊరుకి మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలోని చాలా సమస్యలను ప్రస్తావించినట్టు చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి అడుకంటుపోయిందన్నారు. రూ. 80 కోట్లతో నియోజకవర్గంలో పల్లె పండగలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందని, మిగిలిన మూడు మండలాల్లో 80 శాతం పనులు జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, మండల టీడీపీ బెందు మల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు గాలి వెంకటరెడ్డి, వావిలపల్లి రామకృష్ణ, పైడి ముఖలింగం, మెండ రాజారావు, మూకళ్ల భాస్కరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, నేతింటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

3న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/1 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మెట్టక్కివలస టౌన్-2 ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్టుకొమ్మలు తొలగించేందుకు ఈ నెల 3వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెట్టక్కివలస, అమ్మనగర్, కుప్పిలివారివీధి, ఊసవానిపేట తదితర ప్రాంతాలకు సరఫనా నిలిపివేస్తామన్నారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

గార, మార్చి 31(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందడానికి ఈ నెల 2వ తేదీ ఉదయం పది గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తరగతులు వినియోగించుకోవాలి

కంచిలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పల్లి మోడల్ స్కూల్‌లో ఈ నెల 2న నిర్వహించనున్న ఆరో తరగతి ప్రవేశ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులకు ఓరియంటల్ తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఓఎంఆర్ జవాబు పత్రంలో మార్కింగ్, సబ్జెక్టుల వారీగా ప్రశ్నావళి క్రమం తదితర అంశాలపై ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు, ఉపాధ్యాయులు వివరించారు.

ఆదిత్యాలయ భద్రతపై ప్రత్యేక దృష్టి

● సీసీ కెమెరాల నిర్వహణపై పోలీసుల ఆరా

అరసవల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జలుమూరు మండలంలోని వివిధ ఆలయాలలోని గోడలపై అన్యమత ప్రచారానికి సంబంధించిన రాసిన రాతలు జిల్లాలో కలకలం సృష్టించాయి. జిల్లాలోని ఆలయాల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎస్పీ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాకే తలమానికమైన, ప్రఖ్యాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు పనిచేస్తున్న తీరును సోమవారం రాత్రి పోలీసులు పరిశీలించారు. ఆలయానికి సంబంధించిన మొత్తం 32 కెమెరాలు ఉండగా ఎన్ని పనిచేస్తున్నాయి.. పనిచేయని కెమెరాలు ఎన్ని అన్న వివరాలు సేకరించారు. మొత్తం 32 సీసీ కెమెరాలకు గాను నాలుగు కెమెరాలు పనిచేయడం లేదు. ఆదిత్యాలయ సీసీ కెమెరాలకు సంబంధించి ఐపీ అడ్రస్‌ను పోలీసులు ఆలయ సిబ్బంది ద్వారా సేకరించారు. ఈ అడ్రస్ ద్వారా ఆలయ అధికారులు యాక్సిస్ ఇస్తే పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి కూడా ఆలయంలో జరుగుతున్న ఘటనల వివరాలను తెలుసుకునే వీలు ఉంటుంది. అలాగే భద్రతను మరింత పటిష్టం చేయాలని, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని కూడా పూర్తిగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. పనిచేయని కెమెరాలను పునరుద్ధరించి ఆలయ భద్రతపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఇచ్ఛాపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో భాగంగా మండలంలోని అన్ని ఆలయాలు, చర్చిల్లో విడతల వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఈదుపురం గ్రామంలో రెండు చర్చిలు, రామాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డొంకూరు, తులసిగాం గ్రామాల్లో మరో రెండు రోజుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



రామాలయంలో సీసీ కెమెరా ఏర్పాటు పరిశీలిస్తున్న ఎస్ఐ

విద్యా రంగాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుజరాతీపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిని కాపాడుకోవడం ద్వారానే సమాజంలో అందరికీ విద్యా అందుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల యూటీఎఫ్ ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణల వల్ల విద్యార్థుల సంఖ్యను పెంచలేకపోయామన్నారు. ఈ సంస్కరణలు గడిచిన ఐదేళ్లలో దాదాపు పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వదలి వెళ్లిపోయారన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న సంస్కరణలు కూడా ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉపాధ్యాయులకు నమ్మకం కలిగించే పని ఏమి చేయడంలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు పూర్తయినప్పటికీ 12వ పీఆర్సీ నియమించలేదన్నారు. తక్షణం గత పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, ప్రతినిధులు వి.లక్ష్మి, కె.విజయగౌరి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, వివిధ జిల్లాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మంత్రి లోకేష్‌కు సమస్య వివరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

కవిటి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని యూనియన్ సభ్యులు మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు విశాఖలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జిల్లా యూనియన్ నాయకులు కలిసి సమస్యను వివరించి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసిస్టెంట్లను ఏఎస్‌వోలుగా ప్రమోషన్ కల్పిస్తామని జీవో జారీ చేసి తిరిగి వెనక్కి తీసుకోవడంపై పునరాలోచన చేయాలని కోరామన్నారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ యూనియన్ సభ్యులు పి.అశోక్, పి.జగదీష్, గణేష్, నరేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దయాగుణం కలవాడు రాముడు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉపనిష్మందిరంలో సోమవారం శ్రీమద్రామాయణ ప్రవచనాలు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యత్రభ్రాతా సహోదర అనే అంశంపై వక్త పులఖండం శ్రీనివాసరావు వివరించారు. రాముడు ధర్మవర్తనుడని, రామాయణ ధర్మం శాశ్వతం అని అన్నారు. సత్య, ధర్మం, ఈ భూమి పై ఉన్నంతవరకు రామాయణం ఉంటొందని, రామాయణం చదివితే ప్రతి ఒక్కరి పాత్ర గోచరిస్తుందన్నారు. కార్యక్రమంలో డా.కోమలరావు, డా.నారాయణమూర్తి, జంధ్యాల శరత్‌బాబు, అందవరపు సూరిబాబు, నిష్టల నరసింహమూర్తి పాల్గొన్నారు.

పాతపెన్షన్ వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నేత శ్రీహరి

గుజరాతీపేట, మార్చి, 31(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 నియామకాలు ఆలస్యంగా చేపట్టడంతో ఉపాధ్యాయులు పాతపెన్షన్ విధానాన్ని కోల్పోయారని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చి న మెమో 57 ప్రాప్తికి నాటి డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డీఎస్సీ-2003 ఫోరం కన్వీనర్ కె.శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎన్జీవో హోమ్‌లో సోమవారం ఫోరం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఉద్యోగ, ఉపా ధ్యాయ సాధన సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ విషయంలో ప్రభుత్వం న్యాయం చేయకపోతే కోర్టును కోర్టును ఆశ్రయిస్తామన్నారు. సమావేశంలో ఫోరం సభ్యులు రూపరాజు, ప్రకాష్, శ్రీఖర్, శ్రీను, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ



సైకిల్ అందిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బెహరా మనో వికాస్ కేంద్రంలో సైకిళ్లను డీఎస్పీ వివేకానంద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వికలాంగులకు దానం చేయడం గొప్ప విషయమని అన్నారు. వారికి ఈ విధంగా మానసిక వుల్లాసాన్ని ప్రతి ఒక్కరు కల్పించాలని అన్నారు. అనంతరం స్వీట్స్ పండ్లు పంపిణీ చేశారు.

నిధులు మంజూరుపై హర్షం

ఆమదాలవలస, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం లోని అన్ని వార్డులకు తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని టీడీపీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం రూ.68.80 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ నిధులతో పురపాలక సంఘంలో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప నులు తొందరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. నిదులు మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

IN THE HON'BLE COURT OF THE ADDL. FAMILY JUDGE AT: VISAKHAPATNAM
G.O.P. 1963/2023

Between:
Smt. Kathala (Karnika) Gouthami (Rep. by her GPA Holder Sri Kathala Sankar Ravi Kumar) ...Petitioner
And
Karnika Suresh Kumar ...Respondent

NOTICE

To, The Respondent:
Karnika Suresh Kumar, S/o. Dharma Rao, R/at Plot No.27, Lakshmi Nagar Colony,Visakha B-Colony above Jai-Jayam Press, Srikakulam, presently R/at C/o. K. Dharma Rao, D.No.49-35-16/A, NGGO's Colony, Visakhapatnam-530016.

Take notice that the above-numbered G.O.P.1963/2023 which was filed by the petitioner against to you for custody of her minor daughter and the same is posted to 16-04-2025. You are, therefore, required to appear either in person or through a properly instructed Advocate at 10:30 A.M on 16-04-2025, in the above captioned Court failing which you will be set ex parte and the matter will be decided in yours absence.

(By Order of the Hon'ble Court)
SANAPATI ESWARA RAO, Advocate
Visakhapatnam. Cell: 94415 95993

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532

చెత్త.. కంపు!

(ఐదో పేజీ తరువాయి)

టన్నుల కొద్దీ చెత్త నిల్వ ఉండిపోతోంది. కాలువల్లో చెత్త అధికంగా పేరుకుపోతోంది. ఈ చెత్తను బయటకు తీసినా ఎక్కడ పారబోయాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాలువలు శుభ్రం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్ల నిధులు వెచ్చించినా తగిన ప్రణాళిక లేకపోవడంతో వాటిని ఖర్చు చేయలేని పరిస్థితి ఉంది.

● సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించిన తరువాత తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను మూడు విభాగాలుగా వేరు చేయాలి. వాటి నుంచి వర్మీ కంపోస్టు, సంప్రదాయ ఎరువులు తయారు చేసి రైతులకు అందించాలి. కానీ జిల్లాలో డంపింగ్ యార్డులు చాలినంతగా లేవు. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు తగిన సాంకేతిక సిబ్బంది నియామకం లేదు. చెత్త నుంచి వచ్చే ఎరువులు మార్కెటింగ్ చేయడానికి అనువైన వాతావరణం లేదు. సేకరించిన చెత్త ఎక్కువ రోజులు నిల్వ చేస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం ఇంటింటా సేకరించిన చెత్త డంపింగ్‌యార్డులకు తరలిస్తూ నెల తరువాత వాటిని కాల్చి బూడిద చేస్తున్నారు. దీనివల్ల కాలుష్యం నుంచి తమను కాపాడాలంటూ ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నారు.

శిథిలావస్థలో కాలువలు..

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ఆదాయ పరంగా మెరుగ్గా ఉన్నా, వసతుల విషయంలో మాత్రం వెనుకబాటే. ప్రధానంగా కాలువలు, పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉంది. ప్రధాన రహదారులు, జంక్షన్లు తప్ప.. శివారు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను విస్మరిస్తున్నారు. చాలాచోట్ల కాలువల్లో చెత్త, సీసాలు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు దర్శనమిస్తున్నాయి. నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన మురుగు కాలువలే ఇప్పటికీ ఆధారం. చిన్నపాటి వర్షానికే కాలువలు పొంగి ప్రవహిస్తుంటాయి. పాత జాతీయ రహదారి వద్ద కాలువ శిథిలావస్థకు చేరుకుంది. పోస్టాఫీసు వద్ద రోడ్డు కోతకు గురైంది. వర్షం వస్తే ఆ ప్రాంతం చిన్నపాటి చెరువును తలపిస్తుంది. గతేడాది ఇళ్లలోకి నీరు చేరింది. వైసీపీ హయాంలో మునిసిపాలిటీలో రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా చేపట్టారన్న విమర్శలున్నాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో కాలువల పనులు సరిగ్గా చేపట్టలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

● పలాస వంటి మునిసిపాలిటీలో పది ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఉన్నా, సిబ్బంది లేని కారణంగా చెత్తను పారబోయడం తప్ప.. సంపదపై దృష్టి సారించలేక పోతున్నారు. అదనంగా ప్రతి మున్సిపాలిటిలో చెత్త నుంచి సంపద సృష్టించడం కోసం పది మంది సిబ్బందిని నియమిస్తే కొంతవరకూ ప్రభుత్వ ఆలోచన కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఆరంభంలోనే చెత్తసంపద సృష్టి అవరోధాల పాలవుతుండడం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. చెత్తపై కఠినమైన నిబంధనలు అమలు చేయడం, సేకరించిన చెత్తను క్రమపద్ధతిలో వినియోగించకపోతే భవిష్యత్‌లో మునిసిపాలిటీలన్నీ మురికిపాలిటీలుగా మారుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాం..

చెత్తను వినియోగించడానికి చర్యలు తీసుకుంటాం. కాలువల్లో చెత్తను తీయడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇప్పటికే వార్డులను విభజించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాం. కొద్ది రోజుల్లో ఈ సమస్య తీరిపోతుంది. డంపింగ్ యార్డుల నిర్వహణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

-ఎన్.రామారావు, మునిసిపల్ కమిషనర్, పలాస-కాశీబుగ్గ

కొత్త జంట కోరుకునే పెళ్లి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా మీ ప్రతిష్ఠను పెంచుకోండి.
నవీన రీతిలో ఆహ్వానించి బంధుమిత్రులను అలరించండి
▸ శుభాకాంక్షలు
▸ ధన్యవాదాలు
▸ వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

ఐదెకరాల్లో జీడి తోట దగ్ధం

హరిపురం మార్చి31(ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని శ్రీరాంపురం, హొన్నాళి గ్రామాల పరిధిలోని సుమారు ఐదెకరాల జీడితోటతోపాటు మరో ఐదెకరాల అటవీ ప్రాంతం సోమవారం అగ్ని ప్రమాదం వల్ల ఆహుతయ్యింది. స్థానికుల కథనం మేరకు.. కొందరు ఆకతాయిలు రోడ్డు పక్కన నిప్పుపెట్టారు.దీంతో నిప్పు క్రమేపి వ్యాపించి సమీపంలోని జీడితోటలు దగ్ధమయ్యాయి. గాలి వీస్తుండడంతో జీడితోటలతోపాటు పక్కనే ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌కు మంటలువ్యాపించాయి.స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకసిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలనుఅదుపులోకి తీసుకొచ్చారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టడంతో సమీప గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పంటచేతికొచ్చే దశలో చెట్లు కాలిబూడిదయ్యాయని రైతు మందర ఓంకార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అన్యమత ప్రచారంపై దర్యాప్తు

జలుమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) మండలంలోని యలమంచిలి ఎండల కామేశ్వరస్వామి, కామినాయుడుపేట, కొండపోలవలస ఆంజనేయస్వామి ఆలయాల గోడలపై అన్యమత ప్రచారానికి సంబంధించిన రాతలు రాయడంపై ముమ్మరంగా దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ నేతృత్వంలో ఏడుబృందాలు ఏర్పాటుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని చెప్పారు. ఎండల కామేశ్వరస్వామి ఆలయం, యలమంచిలిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో దోషులను పట్టుకుంటామని స్పష్టం చేశారు.

ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి

వజ్రపుకొత్తూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆలయాల గోడలపై అన్యమత ప్రచారం చేపడితే వారిపై చట్టపరమైనచర్యలు తప్పవని కాశీబుగ్గ సీఐ తిరుపతిరావు హెచ్చరించారు. సోమవారం పూండి- గోవిదంపురం శివా లయంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మాజీజీ సర్పంచ్ గోపి, విఘ్నేష్ పాల్గొన్నారు.

● పాతపట్నం మార్చి31(ఆంధ్రజ్యోతి):ఆలయాలు,చర్చిల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ బి.లావణ్య కోరారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలపరిధిలో గల ఆలయాల అర్చకులు, చర్చి పాస్టర్లతో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల్లో విగ్రహాలకు సంబంధించి ఆభరణాలు బ్యాంక్ లాకర్ల లో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ అధికారులపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

హరిపురం, మార్చి31 (ఆంధ్రజ్యోతి):ఎక్సైజ్ అధికారులపై జాతీయ ఎస్టీ కమిషన్, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదుచేసినట్లు గిరిజన సంక్షేమ సంఘం పరిరక్షణ నాయకులు సవర నరసింగరావు, నారాయణరావు, బాలకృష్ణ, హరికృష్ణ తెలిపారు. ఈమేరకు పోస్టులో పంపించినట్లు చెప్పారు. సోమవారం మందసలో వారు విలేకరులతో మాట్లాడుతూ సారా తయారీ, రవాణా, అమ్మకాలతో కనీసం సంబంధంలేని గిరిజన యువకులు, బాలింతలు, మహిళలపై ఎక్సైజ్ అధికారులు అన్యాయంగా కేసులు బనాయించి అరెస్ట్‌చేస్తున్నారని వాపోయారు.ఐటీడీఏ పీవో కలుగుజేసుకుని న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో సవర సోమయ్య, లక్ష్మణరావు, ఎస్.శంకర్, మానస, మాదవ, తులసీరావు, రమేష్ పాల్గొన్నారు.

ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం

హరిపురం,మార్చి31(ఆంధ్రజ్యోతి):దివంగత పీపుల్స్‌వార్ పార్టీ నాయకుడు కామ్రేడ్ గుంటి అప్పన్న ప్రజల హక్కులకోసం నిరంతరం పోరాటం చేస్తూ, విప్లవ ధ్రువతారగా నిలిచారని వక్తలు కొనియాడారు. సోమవారం మందస మండలంలోని గంగువాడలో గుంటి అప్పన్న ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మడియా రామకృష్ణ, దున్న హరికృష్ణ, బత్తిన లక్ష్మణ్, రామస్వామి, రమేష్, కపిల్ పాపారావు పాల్గొన్నారు.

వైపీఎల్ -8 ట్రోఫీ విజేత వైఎంసీఏ

నరసన్నపేట,మార్చి31(ఆంధ్రజ్యోతి):ఉగాది పురస్కరించకుని నిర్వహించిన ఎర్రంనాయుడు ప్రీమియం లీగ్ -8(వైపీఎల్) ట్రోఫీని నరసన్నపేట యంగ్ మాస్టర్ క్రికెట్ అసోసియేషన్(వైఎంసీఏ) జట్టు కైవసం చేసుకుంది. సోమవారం నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానంలో సబ్‌సెంటర్ బాయ్స్‌వైఎంసీఏ మధ్యపోటీ జరగ్గా వైఎంసీఏ ట్రోఫీ కైవసం చేసుకుంది.ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా స్వాతిక్, బౌలర్‌గా కె.గణేష్ ఎంపికయ్యారు. విజేతకు ట్రోఫీతో పాటు రూ.51వేల నగదు బహుమతి, రన్నర్స్ జట్టుకు రూ.25వేలు ప్రైజ్ మనీ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, మెండ దాసునాయుడులు పాల్గొన్నారు.

వైద్యుడు బాలకృష్ణకు పితృవియోగం


మల్లేశ్వరరావు (ఫైల్)

కాశీబుగ్గ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో గల చినబాడాంలోని సాయిశ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు టి.బాలకృష్ణ పితృమూర్తి తాళాభక్తుల మల్లేశ్వరరావు(69) ఆదివారం రాత్రి మృతిచెందారు. మల్లేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలందించగా,పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, వివాహితులైన ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు బాలకృష్ణ ఎముకులు, కీళ్ల,నరాల వైద్యనిపుణుడిగా పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో గుర్తింపు పొందారు.కాగా బాలకృష్ణ కుటుంబానికి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మందస, నందిగాం ఎంపీపీలు నడుమూరు శ్రీరామమూర్తి, డొక్కరి దానయ్య, పలాస పట్టణ, నందిగాం మండల టీడీపీ అధ్యక్షులు బడ్డ నాగరాజు, పినకాన అజయ్‌కుమార్, సత్యసాయి ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మల్ల రామేశ్వరరావు సంతాపం తెలిపారు. కాశీబుగ్గకు చెందిన వైద్యులు ఎం.మల్లేశ్వరరావు, కూన మోహన్‌బాబు, పొందల జగదీష్, చింతాడ సుధీర్, సత్య సుభాష్, ఎం.విజయలక్ష్మి, ఎస్.విజయకుమార్‌తోపాటు ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి చెందిన పలువురు బాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు.బాలకృష్ణ అభిమానులు చినబాడంలోని ఆయన స్వగృహంలో వద్ద ఏర్పాటు చేసిన మల్లేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇంటర్ విద్య.. మరింత ముందుకు

(ఐదో పేజీ తరువాయి)

ఉండగా.. ఇకపై ఎనిమిది పీరియడ్లు ఉండేలా టైమ్‌టేబుల్ విడుదల చేశారు. మొత్తం సిలబస్‌ను డిసెంబరు 31వ తేదీ కంటే ముందే పూర్తి చేసి రివిజన్ ప్రారంభిస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో సైన్స్ గ్రూపు విద్యార్థులకు జేఈఈ, ఎంసెట్‌లకు కూడా శిక్షణ ఇస్తారు.

● పదో తరగతి విద్యార్థులకు సెమిస్టర్ విధానంలో పుస్తకాల ఏర్పాటు తరహాలోనే ఇంటర్ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిపి ఒక పుస్తకం, బోటనీ, జువాలజీకలిపి బయాలజీగా మరోపుస్తకం, గణితం1ఏ, 1బి కలిపి ఒకే పుస్తకంగా రూపొందించారు. కొత్తగా ఎంబైపీసీ సైతం ప్రవేశపెట్టారు. ఈ కోర్సులో ఎంపీసీ విద్యార్థులు బయాలజీ, బైపీసీ విద్యార్థులు గణితం చదవవచ్చు. ఈ కోర్సు చేసినవారు ఇంజనీరింగ్ లేదా వైద్యవిద్య వైపు వెళ్లవచ్చు. వీటితో పాటు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం కింద పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, ప్రాక్టికల్ పరికరాలు అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ద్వితీయ విద్యార్థులకు యథావిధిగా పాత సిలబస్‌లోనే పాఠ్యాంశాలు బోధించనున్నారు. ప్రభుత్వ కళాశాలలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్‌నెలాఖరులోగా పుస్తకాలు అందజేస్తారు. ఇంటర్‌లో కొత్త విద్యావిధానం వలన కార్పొరేట్‌తో పోటీపడేలా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు వీలుంటుందని విద్యావేత్తలు భావిస్తున్నారు.

పర్యవేక్షణ లేక.. ప్రయాణికులకు పాట్లు

● బస్సులు నిలపడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
● ఇదీ టెక్కలి ఆర్టీసీ అవుట్‌గేట్ వద్ద పరిస్థితి



టెక్కలి ఆర్టీసీ ఔట్‌గేట్ వద్ద బస్సులు నిలపడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

టెక్కలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాతజాతీయ రహదారి ఆర్టీసీ ఔట్‌గేట్ వద్ద ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ప్రధానంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సులు పాతజాతీయరహదారిపై ఆపడం, అదే స్థలంలో ప్రైవేట్ బస్సు సర్వీసులు, ఇతర రవాణా సర్వీసులు కూడా నిలపడంతో ఈ ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా నిలిచింది. దీనికితోడు రోడ్డు పక్కన కొందరు చిరువ్యాపారాలు చేయడం వల్ల వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే పాత జాతీయరహదారిపై వరుసగా మూడు, నాలుగు వాహనాలు నిలపడం మరింత సమస్యగా మారింది. పాతజాతీయరహదారిపై ఆర్టీసీ ఔట్‌గేట్ వద్ద పలు రకాల వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా పోలీసులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు

నిర్వహణ లేక.. పూడిక తొలగించక

● దోమల స్వైరవిహారం ● ఇదీ కొరసవాడలో పరిస్థితి

పాతపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరసవాడలో పంచాయతీలో అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో మురుగుకాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించని పరిస్థితి నెలకొంది. దీంతో చీకటిపడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలోని పలుచోట్ల కాలువలు మురుగుతో నిండిపోయాయి.దీంతో సీసీరోడ్లపైకి మురుగునీరు చేరుతుండడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. సుమారు పది వేల మంది జనాభా గల ఈ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడంతో కాలువలు మురుగుతో నిండిపోయాయని పలువురువాపోతున్నారు. కొరసవాడలోని ప్రధాన రహదారి నుంచి షిర్డీసాయి మందిరప్రాంగణం, పెద్దవీధి వరకూ వెళ్లే సీసీ రోడ్డుపై పలుచోట్ల మురుగునీరు చేరుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


చెత్తతో నిండిపోయిన మురుగు కాలువ


శిథిలావస్థకు చేరిన రిట్టపాడు వంతెన

గోడలు కూలి.. శ్లాబ్ పెచ్చులూడి

● శిథిలావస్థకు చేరడంతో భయాందోళన చెందుతున్న వైనం
● ఇదీ రిట్టపాడు వద్ద వంతెన పరిస్థితి

వజ్రపుకొత్తూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని రిట్టపాడు వద్ద బీటీ రోడ్డుపై ఉన్న బ్రిటీష్ కాలం నాటి వంతెన శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే వంతెన రక్షణ గోడలు బీటలు వారాయి. శ్లాబ్ కింది భాగంలో పెచ్చులూడుతున్నాయి.ఈమార్గంలో నిత్యం 50 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీగా ఉంటోంది. మార్కెట్, కళాశాలలు, ఆసుపత్రి వంటి అత్యవర సేవలకు వెళ్లేందుకు ఉద్దానం వాసులకు ఈ వంతెన గుండానే రాకపోకలు సాగించాల్సిఉంది. ఈ నేపథ్యంలో వంతెనను తొలగించి కొత్తది నిర్మించాలని దశాబ్దకాలంగా స్థానికులు కోరుతున్నా నిధులు మంజూరు కావడం లేదు. వంతెన కూలిపోతే 50 గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు చెపట్టాలని పలువురు కోరుతున్నారు.

పదివేల సోలార్ కనెక్షన్ల మంజూరు

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, మార్చి31(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తోందని, ఇందులో భాగంగా నియోకవర్గానికి పదివేల సోలార్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం సంతబొమ్మాళిలోసూర్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ సంతబొమ్మాళి నుంచి కోటబొమ్మాళి రహదారికి రెండురోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు.పోలాకి నుంచి నౌపడ వరకు డీపీఎన్ రోడ్డు, నౌపడ నుంచి వెంకటాపురం వరకు రోడ్లకు 102 కోట్లు మంజూరుకావడంతో పనులు ప్రారంభిస్తామన్నారు. వడ్డివాడ, నౌపడ వద్ద రైల్వే వంతెనల నిర్మాణాలకు టెండర్లు పూర్తయ్యావని పనులు ప్రారంభవు తాయని చెప్పారు. ఆయన వెంట హరివరప్రసాద్, మాజీ సర్పంచ్‌లు కాంతారావు,మెండ అప్పారావు ఉన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

కోటబొమ్మాళి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.సోమవారం కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవనంలో ముఖ్యమంత్రి సహాయనిధి రూ.14, 73, 550 లక్షల చెక్కులను 14 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, నాయకులు బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేయాలి

ఉపాధ్యాయులపై ఉన్న కేసులు ఎత్తివేయాలని మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్ర ఉన్నత అధికారులకు సూచించారు.కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. కుప్పిలిలో జరిగిన పదోతరగతి పరీక్షలకు సంబంధించి డీఈవో అలజడి సృష్టించారని మంత్రికి ఉపాధ్యాయ సంఘాలు ప్రతినిధులు మురళీమోహన్, రాజారావు, శివరాంప్రసాద్ వివరించారు. ఉపాధ్యాయులపై సస్పెన్షన్, క్రిమినల్ కేసులనుఎత్తివేయాలని కోరారు. దీంతో ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించాలని పలువురు యువత వినతిప త్రం అందజేశారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగే జాబ్ మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఏపీరాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోజరిగే జాబ్‌మేళాకు నియోజకవర్గంలో నిరుద్యోగులు సంబంధిత విద్యా ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

టీడీపీ హయాంలో మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.ఈ మేరకు నిమ్మాడలోని కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.రంజాన్ పురస్కరించుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలకోసం పనిచేసేది టీడీపీయే

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


ఉర్లాంలో టీడీపీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న రమణమూర్తి

నరసన్నపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అధికారంతో సంబంధం లేకుండా ప్రజల కోసం పనిచేసే పార్టీ టీడీపీయేనని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.సోమవారం ఉర్లాంలో టీడీపీ సభత్వ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వం కార్డులే అసలైన గుర్తింపు అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పార్టీ మండలాధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, జల్లు చంద్రమౌళి, అడపా చంద్రశేఖర్, కన్నేపల్లి ప్రసాద్, పూతి రమణ, రావాడ కృష్ణ, చమళ్ల వామనమూర్తి, యాగళ్ల విజయ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


జానకిరావుతో మాట్లాడుతున్న శిరీష

వజ్రపుకొత్తూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.మండలంలోని కొత్తపేటలో జరిగిన టీడీపీ ఆవిర్భావవేడుకల్లో జెండా కడుతూ విద్యుదాఘాతానికి గురై కార్యకర్త గుంటు జానకిరావు గాయపడిన విష యం విదితమే.దీంతో సోమవారం కొత్తపేటలో జానకిరావును శిరీష పరామర్శించారు. ఆమెవెంట టీడీపీ నాయకులు మల్లా సూర్యం, పుచ్చ ఈశ్వరరావు, గోవిందపాపారావు, బైపల్లి నారాయణ, కంబాల రాంబాబు, చింత నారా యణ, నారాయణస్వామి ఉన్నారు.

నువ్వులరేవులో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం


అమ్మవారి దాసులుగా వ్యవహరిస్తున్న గ్రామ పెద్దలు

వజ్రపుకొత్తూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నువ్వులరేవులో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉగాది రోజున బృందావతి మాత ఆలయం వద్ద జెండాను ఎగరవేసి వేడుకలు ప్రారంభించిన గ్రామస్తులు... సోమవారం మరో గ్రామదేవత తక్కురాణి ఆలయానికి భారీ ఊరేగింపుగా చేరుకున్నారు. మువ్వల డొమ్మ, ఘంటోమో నరిదాసులకు అమ్మవారి వేషాలు వేసి... ఊరేగింపుగా తీసుకు వెళ్ళారు.అమ్మవారికి గుడిలో తీర్థ ప్రసాదాలు సమర్పించిన తరువాత గ్రామంలో పగటి వేషాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఏటా గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించే ముందు మూడు రోజుల పాటు గ్రామదేవతలను కొలుస్తారు. దీనిలో భాగంగా సోమవారం తక్కురాణి అమ్మవారి గుడిలో పూజలు చేసినట్లు స్థానికులు చెప్పారు.

పెంటూరులో వినాయక విగ్రహం ప్రతిష్ఠ

నందిగాం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటూరులో నిర్మించిన వినాయక మందిరంలో విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. స్థానిక కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన కూర్మాపు అప్పారావు, రెయ్యమ్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్మించిన మందిరంలో పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకులు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో విశేషపూజలు నిర్వహించారు. మందిర స్థలదాత ఏవీవీ ఠాగూర్ దంపతుల్ని అభినందించారు.

నేటి నుంచి సెంచూరియన్‌లో ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ సమావేశాలు

● విశ్వవిద్యాలయ అడ్మిషన్ జనరల్ మేనేజర్ ఫాల్గుణరావు


మాట్లాడుతున్న ఫాల్గుణరావు

పర్లాకిమిడి,మార్చి31(ఆంధ్రజ్యోతి):పర్లాకిమిడి సమీపంలో గల రాజ్‌సీతాపురం వద్ద గల సెంచూరియన్ యూనివర్శిటీలో మంగళవారం నుంచి ఈనెల ఐదోతేదీ వరకూ మూడో ఏఐయూ నేషనల్ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ విశ్వవిద్యాలయ అడ్మిషన్ జనరల్ మేనేజర్ ఎస్.ఫాల్గుణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎం పవరింగ్ వాయిసెస్-షేపింగ్ ఫ్యూచర్స్ ఆఫ్ వికసిత్‌భారత్ అనే థీమ్‌తో కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. మహిళల సామర్థ్యం పెంపు, ఆర్థికస్వావలంబనపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రవీణ్ మృతిపై విచారణ నిర్వహించాలి

పలాస, మార్చి 31(ఆంధ్రజ్యోతి):పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయవిచారణ జరిపించాలని క్రైస్తవ మైనార్టీ జనరల్ సెక్రటరీ డీవీడీవీ కుమార్(బోసుబాబు) కోరారు. ఈ మేరకు ప్రవీణ్ పగడాల సంతాపసభ బుధవారం శ్రీకాకుళం తెలుగు బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం పలాసలో జిల్లా పాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.కృపానందం, జాన్‌డేవిడ్, సుందరసింగ్, కె.జోసెఫ్, కిరణ్, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

నరసన్నపేటలో ఆరు పిక్కలాట

నరసన్నపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో సోమవారం జరిగిన వసంతోత్సవాల్లో ఆరుపిక్కలాట యథేచ్ఛగా నిర్వహించారు. రాత్రి పట్టణంలో శ్రీకూర్మం, కరగాం, కరజాడ తదితర గ్రామాలకు చెందిన ఆరుపిక్కలాట నిర్వాహకులు సిండికేట్‌గా మారి బహిరంగంగా నిర్వహించారు. అధికార, ప్రతిపక్షపార్టీలకు చెందిన కొందరు మద్దతుతో ఆరుపిక్కలాట నిర్వహించారని విమర్శలొస్తున్నాయి. పట్టణంలో ఈ ఆట నిర్వహిస్తే ఓ నాయకుడికి రూ.60వేలు రోజువారీ చెల్లించాలని, పోలీసులు కూడా రోజుకు రూ.లక్షా చెల్లించేందుకు ఒప్పంద కుదిరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా ఆరుపిక్కలాట నిర్వహణపై నరసన్నపేట పోలీసుస్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చామని, తాను జలుమూరులో ఓ కార్యక్రమంలో ఉన్నానని సీఐ జె. శ్రీనివాసరావు తెలిపారు.

సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

జలుమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) పౌరసరఫరాల మండల గోదాము నుంచి రేషన్ షాపు డీలర్లకు నిత్యావసర సరుకులు పంపిణీలో పారదర్శకత పాటించాలని తహసీల్దారు జె.రామారావు గోదాము ఇన్‌చార్జికి సూచించారు.సోమవారం జలుమూరులోని మండల నిత్యావసర సరుకుల గోదామును తనిఖీచేశారు. ఆయన వెంట ఆర్ఐ కిరణ్, గోదాము ఇన్‌చార్జి సంధ్యారాణి, వీఆర్వో రాము ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

టెక్కలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షులు నరేంద్రచక్రవర్తి కోరారు. బీజేపీ టెక్కలి మండల ప్రధాన కార్యదర్శిగా నేతింటి రాజారావును నియమితులైన సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్య క్రమంలో నరేంద్రచక్రవర్తి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, జర్జాన రామ్‌జీ, ఉమాబాబులు అన్నారు.

మహిళలు ఆత్మరక్షణపై దృష్టి సారించాలి

టెక్కలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మరక్షణపై దృష్టిసారించాలని శక్తి పోలీస్ టీమ్ ఎస్ఐ బి.బాలకృష్ణ కోరారు.సోమవారం స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో తైక్వాండ్ కోచ్ నర్శిపురం శేఖర్ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధారాణి, పలువురు మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల వ్యాధులపై అవగాహన

టెక్కలి, మార్చి 31(ఆంధ్రజ్యోతి):చిన్ననారాయణపురంలో సోమవారం గొర్రెలు పెంపకందారులకు వైద్యులు మెట్ట పూర్ణచంద్రరావు మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహనకల్పించారు.మంగళవారం నుంచి అమలుకానున్న ఇన్సూరెన్స్ విధానంపై అవగాహనకల్పించారు.కార్యక్రమంలో జగదీష్ పాల్గొన్నారు.

సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

కొత్తూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ కోరారు.ఈ మేరకుఆసుపత్రి 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కురిగాంఆసుపత్రి ఆవరణలో సమావేశం నిర్వహించారు.

కరణాలపేట బీటీ రోడ్డుకు ప్రతిపాదనలు

పోలాకి, మార్చి31 (ఆంధ్రజ్యోతి): కరణాలపేట గ్రామానికి బీటీ రహదారి నిమిత్తం రూ.50లక్షలతో కొత్త ప్రతిపాదనలు పెట్టినట్లు మాజీ సర్పంచ్ డోల ప్రసాదరావు చెప్పారు. సోమవారం పోలాకిలో విలేకరులతో మాట్లాడుతూ 2018లో బీటీ రహదారి నిర్మాణానికి శిలాఫలకం వేసినా, తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ముందుకుసాగలేదని చెప్పారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

హిరమండలం, మార్చి31 (ఆంధ్రజ్యోతి):హిరమండలం పంచాయతీలో మంగళ, బుధవారాల్లో కుళాయిల ద్వారా పూర్తి స్థాయిలో తాగునీటిని అందించలేమని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొట్టాపోలమ్మ గుడి దగ్గర సీపీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించి కొత్తగా ఏర్పాటు చేసిన పైపులైన్‌కు లీకులు ఏర్పడడంతో రెండు రోజులు పాటు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు.నీటిసరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలుసహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు..

జలుమూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోగల జలుమూరు టౌన్ ఫీడర్ పాత బ్రేకర్ స్థానంలోకొత్త బ్రేకరుఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు ఉదయం ఎనిమదినుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు చల్లవానిపేట, జలుమూరు, టెక్కలిపాడు, రావిపాడు, రావాడపేట, హరికృష్ణమ్మపేట, సొడాం, దరివాడ, జోనంకి, తలతరియా, అల్లాడ, నైరిగాం, లింగాలవలస గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కులగణన చేసి వర్గీకరించాలి

నరసన్నపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి):హేతుబద్ధత లేని ఎస్సీ వర్గీకరణ ఆపాలని, కులగణనచేసి జిల్లా, జోన్ వారీగా వర్గీకరించాలని, వెనుకబాటుతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని రెల్లి కులాల సంఘ నాయకుడు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బెవర రాము డిమాండ్‌చేశారు. సోమవారం స్థానిక పచేరి కాలనీ, పురుషోత్తంనగర్, బొడ్డవలసలో ఎస్సీ వర్గీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళంలో పెద్దరెల్లి వీధి నుంచి కలెక్టరేట్ వరకూ బుధవారం ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెల్లి సంఘ నాయకులు అర్జి కోటి, దూళి మోహనరావు, సుధాకర్ మాస్టార్, డేవిడ్ , వీరేషు, కోటిపల్లి శ్రీను, కూన రమేష్, మోహనరావు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

మెళియాపుట్టి,మార్చి31(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలోని ముస్లిముకాలనీలో నివాసముంటున్న 30కుటుంబాలకు రంజన్ తోఫా కిట్లను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి ఎమ్మెల్యే గోవిందరావు సౌజన్యంతో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిము మత పెద్దలు సయ్యద్ షేక్ చాంద్,సయ్యద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పాతపట్నంలో నీతికథల పోటీలు

పాతపట్నం, మార్చి31(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని షిర్డీగిరిపైగల సాయిబాబా ధ్యాన మందిరంలో వసంతోత్సవాలు పురస్కరించుకుని సోమవారం నీతికథల పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. విజేతలకు ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకప్రతినిధి తారకేశ్వరరావు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు అదనపు సాయం

వజ్రపుకొత్తూరు/ పలాస రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): 2019-24లో చేపట్టి, అర్థాంతరంగా నిలిచిపోయిన ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహాయం చేస్తుందని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు సిహెచ్ మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేలు, ఆదివాసి గిరిజనులకు రూ. లక్ష ప్రభుత్వం అందించనుందని పేర్కొన్నారు.

అలరించిన గయోపాఖ్యానం

పలాసరూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణతర్లాలో కాటమేశ్వరి అమ్మవారి ఆలయ 43వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆదివారంరాత్రి ప్రదర్శించిన నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం,సత్యహరిశ్చంద్ర నాటకాలను అలరించాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

పలాసరూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): గొల్లమాకన్నపల్లికి చెందిన జనసేన నాయకుడు కోరాడ మధుసూదన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని మునిసిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు పరామర్శించారు. ఆయన వెంట జనసేన నాయకులు ఉన్నారు.